రోగులకు వైద్య నిపుణుల సేవలు

ఉండ్రాజవరం: మూడో శుక్రవారం సందర్భంగా ఉండ్రాజవరం పీహెచ్‌సీలో స్పెషలిస్ట్ వైద్యులు రోగులకు సేవలు అందించారు. ప్రసూతి వైద్య నిపుణురాలు మృదుల 15 మందికి, ఊపిరితిత్తుల వైద్య నిపుణురాలు మేరీ వసంత ఐదు గురిని పరీక్షించారు. వారికి తగిన సలహాలు, సూచనలు అందజేశారు.







జగనన్నకు ఆత్మీయ స్వాగతం పలుకుదాం

- నేటి ముఖ్యమంత్రి నిడదవోలు పర్యటనకు తరలి రండి
- ప్రజాప్రతినిధులకు, వైఎస్సార్ సీపీ శ్రేణులకు మంత్రి వనిత పిలుపు
- కొవ్వూరులో పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: నిడదవోలు పర్యటనకు శనివారం విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరం ఆత్మీయ స్వాగతం పలుకుదామని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతానికి ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలని ఆమె కోరారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని శుక్రవారం సాయంత్రం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించారు. సమావేశంలో మంత్రి వనిత మాట్లాడుతూ సీఎం బహిరంగ సభకు తరలి వెళ్లే పార్టీ శ్రేణులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. పార్టీ నాయకులు కూడా ప్రణాళికాబద్ధంగా పని చేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. నిడదవోలులోని సెయింట్ ఆంబ్రోస్ హైస్కూలు మైదానంలో శనివారం ఉదయం పది గంటలకు ముఖ్యమంత్రి బహిరంగ ప్రారంభం అవుతుందన్నారు. ఏర్పాట్లపై మంత్రి మండలాల వారీగా పార్టీ నాయకులతో సమీక్షించారు. వారికి పలు సూచనలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, కొవ్వూరు, చాగల్లు ఎంపీపీలు కాకర్ల సత్యనారాయణ, మట్టా వీరాస్వామి, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు బండి పట్టాభి రామారావు, వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, పార్టీ కొవ్వూరు మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణరాజు, పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేద్దాం

ఉండ్రాజవరం: వైఎస్సార్ కాపు నేస్తం నాలుగో విడత నిధుల విడుదలకు శనివారం నిడదవోలు వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులను కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలే గాకుండా జగన్ ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు పొందిన ప్రతి ఒక్కరూ సీఎంకు కృతజ్ఞతలు తెలుపు కోవాల్సిన బాధ్యత ఉందన్నారు. మండలంలో 15 గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి సీఎం సభను విజయవంతం చేయాలని కార్యకర్తలను, ప్రజలను కోరారు.

పెరవలి: ముఖ్యమంత్రి బహిరంగ సభకు మండలం నుంచి నిడదవోలు తరలి వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు స్వయంగా దగ్గరుండా చూసుకోవాలని ఎంపీపీ కార్నెర్ల ప్రసాద్ కోరారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఖండవల్లిలో సచివాలయ ఉద్యోగులతో ఎంపీపీవో దామోదర రావు ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎంపీపీ ప్రసాద్ మాట్లాడుతూ పెరవలి మండలం నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలుకదామన్నారు. ఎంపీడీఓ దామోదరరావు మాట్లాడుతూ సభకు వచ్చేవారికోసం ప్రత్యేకంగా బస్‌లు ఏర్పాట్లు చేశామన్నారు.



నేడు పాఠశాలలకు సెలవు

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూల్స్ పేరెంట్ కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు శనివారం జిల్లాలో పాఠశాలలకు ఒక రోజు సెలవు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఉత్తర్వులు జారీ చేశారన్నారు. సోమవారం వినాయక చవితి పండగ నేపథ్యంలో శనివారం స్కూళ్లకు సెలవు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

బొప్పాయి రైతులకు సబ్సిడీలు ఇవ్వాలి

కొవ్వూరు: బొప్పాయి రైతులకు ప్రభుత్వ సబ్సిడీ పథకాలు అందించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ కోరారు. మండలంలోని దొమ్మేరు గ్రామంలోని కోరుకోండ సత్యనారాయణ అనే రైతుకు చెందిన బొప్పాయి తోటను శుక్రవారం శ్రీనివాస్ పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బొప్పాయి, ఇతర పండ్ల తోటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం విత్తనాలు, డ్రిప్ పరికరాలను సబ్సిడీపై అందించాలన్నారు. బొప్పాయిలో సాగు సమస్యలను ఆయన రైతును అడిగి తెలుసుకున్నారు.



